క్లుప్తంగా

యోగా గురువు భైరవమూర్తికి సత్కారం



యోగా గురువు భైరవమూర్తికి అవార్డు అందజేస్తున్న చిక్కం సోదరులు

అమలాపురం టౌన్: గీతా జయంతిని పురస్కరించుకుని స్థానిక యర్రమల్లివారి వీధిలో గల ఎస్ఎస్ఆర్ ఎల్డీఎల్ ట్రైనింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు జాతీయ యోగా న్యాయ నిర్ణేత, రాష్ట్రపతి అవార్డు గ్రహీత మోటూరు భైరవ స్వామికి ఎన్లైటనింగ్ ఎడ్యుకేటర్ అవార్డును బుధవారం ప్రదానం చేశారు. ఈ సంస్థ సీఈవో చిక్కం సాంబశివరావు, సీఎఫ్వో డాక్టర్ చిక్కం శాంతి స్వరూప్ సోదరుల చేతల మీదుగా భైరవమూర్తికి ఈ అవార్డు ప్రదానం జరిగింది. అయినవిల్లి మండలం నల్లచెరువు గ్రామానికి చెందిన యోగా గురువు భైరవ స్వామి యోగా శిక్షణతో వేలాది మందిని యోగా వైపు అడుగులు వేయించారని వక్తలు కొనియాడారు.

రేపు రైతు సమస్యలపై ర్యాలీ

వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహణ

అమలాపురం టౌన్: రైతు సమస్యలపై పట్టణ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ, జిల్లా కలెక్టర్కు వినతి పత్రం సమర్పణ తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా స్థానిక వాసర్ల గార్డెన్స్లో గురువారం ఉదయం 9 గంటలకు పట్టణ పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసినట్లు పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని తెలిపారు. ఈ సమావేశానికి పట్టణానికి చెందిన పార్టీ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు విధిగా హాజరై రైతు సమస్యలపై చేపడుతున్న ర్యాలీని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం స్థానిక హైస్కూల్ సెంటరు నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించి అనంతరం కలెక్టర్కు వినతి పత్రం సమర్పించనున్నట్లు బులినాని వివరించారు.

కొనసాగుతున్న విచారణ

ముమ్మిడివరం: కోనసీమ జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో వివిధ శాఖల సిబ్బందిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై బుధవారం సైతం విచారణ కొనసాగింది. కార్యాలయంలో జరుగుతున్న అవినీతిపై సాక్షి దిన పత్రికలో 'ఆరోగ్య శాఖలో అవినీతి జబ్బు' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై దశలవారీగా విచారణ జరుగుతున్న విషయం తెలిసిందే. డీఎంఅండ్హెచ్ఓ కార్యాలయంలో వివిధ శాఖలలో పనిచేస్తూ ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు సిబ్బందిని విచారణాధికారి, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి బీవీవీ సత్యనారాయణ తన కార్యాలయంలో బుధవారం విచారించారు. ప్రశ్నావళిలో లిఖిత పూర్వక వివరణ తీసుకున్నారు. మరి కొంత మంది సిబ్బందిని విచారించి పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు నివేదించనున్నారు.

ఎంట్రుకోన ఉప సర్పంచ్ శ్రీలత రాజీనామా

అల్లవరం: ఎంట్రుకోన ఉప సర్పంచ్గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కన్నెపాముల శ్రీలత తన పదవికి రాజీనామా చేస్తూ ఎంపీడీఓ కృష్ణమోహన్కు బుధవారం రాజీనామా పత్రాన్ని అందించారు. వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేస్తున్నానని లేఖలో పొందుపరిచినట్లు ఎంపీడీఓ తెలిపారు. ఆమె ఇచ్చిన రాజీనామా పత్రాన్ని ఆమోదించడం జరిగిందన్నారు.

మల్లిబాబు స్వామికి సత్కారం



సుంకరపాలెంలో మల్లిబాబు స్వామిని సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

తాళ్లరేవు: సుంకరపాలెం గ్రామంలో ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయం వద్ద 54 రోజుల పాటు భిక్ష కార్యక్రమంలో భాగంగా స్వాములకు వండి వడ్డించిన కోలంక గ్రామానికి చెందిన ఏడిద మల్లిబాబు స్వామిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎటువంటి లాభాపేక్ష లేకుండా స్వాములకు మల్లిబాబు స్వామి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కౌశల్ పోటీలకు మురమళ్ల విద్యార్థి

ఐ.పోలవరం: రాష్ట్ర స్థాయి కౌశల్ పోటీలకు మురమళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన మంతెన వెంకట రమణ ఎంపికయ్యారు. జిల్లా స్థాయిలో ఈ నెల 6వ తేదీన జరిగిన కౌశల్ ప్రతిభా పోటీల్లో వెంకట రమణ ప్రతిభ చూపి రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల కోఆర్డినేటర్ ఎల్హెచ్.శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న రమణ ఈ నెల 29, 30వ తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి కౌశల్ పోటీల్లో పాల్గొంటారని హెచ్ఎం ఎం.శ్రీనివాసరావు తెలిపారు. రమణను ఎస్ఎంసీ చైర్మన్ సత్యమూర్తి, ఏ.సూర్యమోహన్, సవరపు వెంకట రమణ, టి.దుర్గా ప్రసాద్తో పాటు పలువురు అభినందించారు.

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

- పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- ఉత్తమ ఫలితాలకు వంద రోజుల ప్రణాళిక
- ఈ నెల 1 నుంచి ప్రారంభం
- ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ
- తల్లిదండ్రులకు కౌన్సెలింగ్



తాళ్లరేవు హైస్కూల్లో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

తాళ్లరేవు: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణతను సాధించడమే లక్ష్యంగా విద్యాశాఖ నూరు రోజుల ప్రణాళికను రూపొందించింది. దీనిలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఈ నెల ఒకటో తేదీ నుంచి ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు ప్రారంభించారు. పరీక్షలకు సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. వారికి ప్రతిరోజూ అదనపు తరగతులు నిర్వహించి మెరుగైన ఫలితాలే లక్ష్యంగా ఉపాధ్యాయులు శ్రమిస్తున్నారు. ముఖ్యంగా మారిన సిలబస్పై పట్టు సాధించి మంచి మార్కులు పొందే విధంగా శిక్షణ ఇస్తున్నారు. ఇప్పటికే సిలబస్ పూర్తి చేసిన ఉపాధ్యాయులు పరీక్షలను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక తర్ఫీదు నిస్తున్నారు. విద్యార్థులకు పరీక్షలంటే భయం లేకుండా ఉండేందుకు ప్రతిరోజూ ఓ సబ్జెక్టుపై పరీక్ష నిర్వహిస్తూ వారిలో మనో ధైర్యాన్ని నింపుతున్నారు. ప్రైవేటు స్కూళ్ల కంటే మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. ఈ మేరకు ఇప్పటికే విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి కౌన్సెలింగ్ ఇచ్చారు. పిల్లలను ఇంటివద్ద కూడా చదివించాలని, వారు చదువులు కొనసాగించడానికి కావాల్సిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. దీంతో ఈ ఏడాది మంచి ఫలితాలు సాధిస్తామని అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.

పరీక్షలంటే పండగలా భావించాలి



టెన్త్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. దీని కోసం ప్రతిరోజూ ఉదయం ఒక గంట, సాయంత్రం ఒక గంట ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులను చదివించడంతో పాటు వారి సందేహాలను నివృత్తి చేయడం జరుగుతుంది. అన్ని సబ్జెక్టులలో ప్రతిభ కనబరిచే విధంగా నిర్దిష్టమైన ప్రణాళికను సిద్ధం చేసుకుని దానికి అనుగుణంగా ఉపాధ్యాయులతో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తున్నాం. అంతే కాకుండా రోజుకో సబ్జెక్టుపై ప్రతిరోజు పరీక్షలు నిర్వహించి వారికి పరీక్షలపై భయం లేకుండా చేస్తున్నాం. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారికి ప్రతి సబ్జెక్టులోనూ ఉత్తీర్ణత సాధించేలా తర్ఫీదు నిస్తున్నాం. విద్యార్థులు పరీక్షలంటే పండగలా భావించే విధంగా వారిని తీర్చిదిద్దుతున్నాం.

– జొన్నాడ ఆశాలత, ప్రధానోపాధ్యాయురాలు, జిల్లా పరిషత్ హైస్కూల్, తాళ్లరేవు.

సందేహాలు నివృత్తి చేస్తున్నారు



ప్రతిరోజూ చెప్పే పాఠాలతో పాటు ఉదయం సాయంత్రం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల్లో మా సందేహాలన్నింటినీ నివృత్తి చేస్తున్నారు. ఉదయం చదివించి సాయంత్రం పరీక్షలు నిర్వహించడం ద్వారా చాలా సులువుగా పరీక్షలు రాయగలుగుతున్నాం. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తామనే నమ్మకం కలిగింది.

– డి.హర్ష, పదో తరగతి విద్యార్థి, తాళ్లరేవు.

వెనుకబడిన సబ్జెక్టులపై ప్రత్యేక శిక్షణ



అదనపు తరగతులు మాకు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయి. ఏ సబ్జెక్టులో వెనుకబడితే ఆ సబ్జెక్టు ఉపాధ్యాయులు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. దీంతో అన్ని సబ్జెక్టులపై పట్టు సాధించగలుగుతున్నాము. ప్రత్యేక తరగతులు, పరీక్షల నిర్వహణ ద్వారా మాకు పరీక్షలపై భయం పోయింది. ఖచ్చితంగా ఉత్తమ ఫలితాలు సాధిస్తాం.

– కె.సుహాసిని, టెన్త్ విద్యార్థిని, తాళ్లరేవు.

మారిన సిలబస్పై అవగాహన



పరీక్షా విధానంలో ప్రభుత్వం పలు మార్పులు తీసుకువచ్చింది. ముఖ్యంగా ఈ ఏడాది సిలబస్ మారడంతో పాటు గత ఏడాది నుంచి మారిన ప్రశ్నాపత్రాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. గతంలో ఒక్కొక్క సబ్జెక్టుకు రెండు పరీక్షలు నిర్వహించేవారు. అయితే గత ఏడాది నుంచి ఒక్కొక్క పరీక్షే మాత్రమే నిర్వహిస్తున్నారు. ఫిజికల్ సైన్స్, నేచురల్ సైన్స్లకు వేర్వేరుగా నిర్వహిస్తున్నారు. మొత్తంగా ఏడు పరీక్షలు రాయాల్సి ఉంటుంది. పరీక్షల విధానంపై అవగాహన కల్పించేలా రోజుకొక సబ్జెక్టు చొప్పున ప్రతిరోజు పరీక్ష నిర్వహిస్తున్నాం. మొత్తంగా ఒక్కొక్క సబ్జెక్టులో 10 నుంచి 11 టెస్ట్లు నిర్వహించడం జరుగుతుంది. పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చిన వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం.

– పుల్లేటి కిషోర్, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు, జెడ్పీ హైస్కూల్, తాళ్లరేవు.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎస్డీసీ భారతి



చొల్లంగి రెవెన్యూ సదస్సులో అధికారులకు తమ సమస్యలను వివరిస్తున్న ప్రజలు

తాళ్లరేవు: భూముల పరిరక్షణతో పాటు భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని ల్యాండ్ ప్రొటెక్షన్ సెల్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(ఎస్డీసీ), ప్రత్యేకాధికారి డి.భారతి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని చొల్లంగి, చొల్లంగిపేట పంచాయతీ కార్యాలయాల వద్ద తహసీల్దార్ పితాని త్రినాథరావు అధ్యక్షతన నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భూయజమానులకు ఎటువంటి సమస్యలు ఉన్నా ఈ సదస్సులలో పరిష్కరించడం జరుగుతుందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తహసీల్దార్ త్రినాథరావు మాట్లాడుతూ ఈ సదస్సులలో రెవెన్యూ సమస్యలతో పాటు రేషన్ కార్డులు, పింఛన్లు వంటి ఇతర సమస్యలకు సంబంధించిన అర్జీలను సైతం స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. చొల్లంగి గ్రామంలో ఉన్న సాల్ట్ భూములను స్థానిక లబ్ధిదారులకే కేటాయించాలని, పలు సంక్షేమ పథకాలను అందించాలని పలువురు కోరారు. చొల్లంగిలో 30, చొల్లంగిపేటలో 10 సమస్యలకు సంబంధించి అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ టి. సూరిబాబు, రీసర్వే డీటీ వీరబాబు, ఆర్ఐ జి.రామకృష్ణ, మండల సర్వేయర్ ఎండీ షఫీవుల్లా, పంచాయతీ కార్యదర్శి పోతాబత్తుల శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది నాయకులు పాల్గొన్నారు.

కంద దీపం.. దేదీప్యమానం



అక్షయపాత్ర ఆధ్వర్యంలో 43 రోజులుగా వెలుగుతున్న కంద దీపం

అమలాపురం టౌన్: స్థానిక విద్యుత్ నగర్లోని ఆదిశేష నిలయంలో శ్రీ గౌతమి మహర్షి అక్షయ పాత్ర సంస్థ ఆధ్వర్యంలో వారాహి అమ్మవారి చిత్ర పటం వద్ద 22 కిలోల కందలో ఏర్పాటు చేసిన అఖండ దీపం 43 రోజులుగా నిరంతరాయంగా వెలుగుతోంది. ఈ దీపాన్ని మరో రెండు వారాలకు పైగా అంటే ఈ నెల 24వ తేదీ వరకూ వెలిగించే ఏర్పాట్లు చేశారు. వారాహి రూపం పోలి ఉన్న 22 కిలోల పెద్ద కంద దుంపను కూరగాయల మార్కెట్లో సేకరించి ఈ కందలో అక్టోబర్ 30న దీపాన్ని వెలిగించారు. కార్తిక మాసంతో పాటు వారాహి హోమాలు, పూజా మహోత్సవాల సమయంలోనూ ఈ అఖండ కంద దీపం దేదీప్యమానంగా వెలుగుతూనే ఉంది. వారాహి అమ్మవారిని పోలి ఉన్న కందకు పసుపు రాసి దీపాన్ని జ్వలింపజేస్తున్నారు. గౌతమ మహర్షి గో సంసరక్షణ సమితి గోశాల వ్యవస్థాపకుడు పోతురాజు రామకృష్ణారావు, అక్షయ పాత్ర వ్యవస్థాపకురాలు నాగ కనకదుర్గ ఆధ్వర్యంలో నిత్యం ఈ కంద దీపానికి ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. నిత్యం ఎంతో మంది భక్తులు ఈ దీపాన్ని దర్శించుకుని వారాహికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

మాలల మహాగర్జనను విజయవంతం చేయాలి



అంబేడ్కర్ భవన్ వద్ద మహాగర్జన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

తాళ్లరేవు: ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈ నెల 15న గుంటూరులో జరగనున్న మాలల మహాగర్జనకు జనం తరలి వచ్చి విజయవంతం చేయాలని మాల మహానాడు తాళ్లరేవు మండల అధ్యక్షుడు దున్నా మురళి పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక అంబేడ్కర్ భవన్ వద్ద జరిగిన కార్యక్రమంలో మాలల మహాగర్జన.. చలో గుంటూరు కరపత్రాన్ని నాయకులు ఆవిష్కరించారు. దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి దున్నా సుబ్రహ్మణ్యం, పోలేకుర్రు సర్పంచ్ వెంటపల్లి నూకరాజు, మాజీ సర్పంచ్ దడాల బుజ్జిబాబు, నాయకులు కాశి లక్ష్మణస్వామి, దడాల జగదీశ్వరరావు, జక్కల ప్రసాద్ తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో పెయ్యల శ్రీనివాస్, రేవు నాగేశ్వరరావు, దాసరి వేణు గోపాల్, గోడి భాస్కరరావు, జల్లి శ్రీను, పినిపే నాగేంద్రరావు, కాలిపల్లి బాల తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గీతా జయంతి ఉత్సవాలు



గీతా జయంతి ఉత్సవాల్లో గీతా పారాయణం చేస్తున్న వివేకానంద కేంద్ర కన్వీనర్ శారద

అమలాపురం టౌన్: కన్యాకుమారి వివేకానంద కేంద్రం అమలాపురం శాఖ ఆధ్వర్యంలో స్థానిక వడ్డిగూడెంలోని శ్రీ వాగ్దేవి స్కూలులో గీతా జయంతి ఉత్సవాలు బుధవారం సాయంత్రం వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాలకు ముందు ఈ నెల 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకూ గీతా సప్తాహాలు జరిగాయి. సప్తాహంలో భగవద్గీత కర్మయోగ శ్లోకాలను వివేకానంద కేంద్ర ప్రతినిధులు ఆలపించారు. జయంతి ఉత్సవాల్లో సైతం గీతా పారాయణంతో పాటు కర్మయోగ శ్లోకాలను చదివి ఆ ప్రాంతాన్ని పునీతం చేశారు. గోదావరి విభాగ్ వివేకానంద కేంద్ర ప్రముఖ్ గండికోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలు జరిగాయి. స్థానిక వివేకానంద కేంద్ర కన్వీనర్ మేజర్ శారద, కో కన్వీనర్లు సువర్ణ, కృష్ణ తదితరులు కర్మయోగ శ్లోకాలను సుమధురంగా ఆలపించి వాటి తాత్పర్యాలను విద్యార్థులకు వివరించారు. వాగ్దేవి స్కూలుకు చెందిన 25 మంది విద్యార్థులు గీతలోని 16 అధ్యాయాలను పారాయణం చేశారు. స్కూలు ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరామచంద్రమూర్తి, న్యాయవాది వెంపరాల భాస్కర శాస్త్రి, వివేకానంద కేంద్ర ప్రతినిధులు మౌనిక, స్వర్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.

'ఫెంగల్' సాయం ప్రకటన

రేషన్కార్డు దారులకు రూ.5వేలు చొప్పున అందజేతకు ఆదేశాలు

యానాం: ఫెంగల్ తుపానుకు తీవ్రంగా నష్టపోయిన బాధిత కుటుంబాలకు బుధవారం పుదుచ్చేరి ప్రభుత్వం ఆర్థిక సహాయాన్ని ప్రకటించింది. ఈ మేరకు డిపార్ట్మెంట్ ఆఫ్ సివిల్ సప్లయిస్ అండ్ కన్జూమర్ ఎఫైర్స్ శాఖ కార్యదర్శి ఎస్ సత్యమూర్తి ఆదేశాలు జారీ చేశారు. గ్రాంట్ ఆఫ్ ఫైనాన్షియల్ అసిస్టెన్స్గా పుదుచ్చేరి, కారైకల్, యానాం రీజియన్లలోని ఒక్కో బీపీఎల్, ఏపీఎల్ రేషన్కార్డుకు రూ.5వేలు చొప్పున లబ్ధిదారులకు బ్యాంకు అకౌంట్లలో నగదు బదిలీ(డీబీటీ) పద్ధతిలో జమ అవుతాయన్నారు. పంట నష్టపోయిన వారికి హెక్టారుకు రూ.30 వేల చొప్పున సహాయం అందనుందన్నారు. ఈ మేరకు సహాయాన్ని మంజూరు చేసిన సీఎం రంగసామి, ఎల్జీ కైలాష్నాథన్కు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్, పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు వేర్వేరు ప్రకటనల్లో కృతజ్ఞతలు తెలిపారు.

అగ్నికుల క్షత్రియ సంఘం సలహాదారు నియామకం

అల్లవరం: కోనసీమ అగ్నికుల క్షత్రియ సంఘం సలహాదారుగా ఎస్.పల్లిపాలెం గ్రామానికి చెందిన కేవీ రాజు నియమితులయ్యారు. ఈ మేరకు సంఘ అధ్యక్షుడు కర్రి స్వామినాథ్ బుధవారం ఉత్తర్వులు ఇచ్చారు. సలహాదారుగా నియమితుడైన రాజుకు సంఘ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

పంట కాలువా.. పెంట కాలువా..?



అమలాపురం శివారు విత్తనాల వారి కాలువలో తిష్ట వేసిన ప్లాస్టిక్ వ్యర్థాలు

అమలాపురం టౌన్: అది ఒకప్పుడు గల గల పారే పంట కాలువ.. ఈ కాలువ ద్వారా పారే గోదావరి జలాలతో ఎన్నో ఎకరాల్లో సాగు జరుగుతోంది. అయితే ప్లాస్టిక్ వర్థాలతో నిండిపోవడంతో ఈ పంట కాలువ ప్రవాహ వేగం మందగించింది. ప్రస్తుతం ఇది పంట కాలువో లేక పెంట కాలువో గుర్తించలేని విధంగా మారింది. అమలాపురం పట్టణ శివారులో ఉప పంట కాలువ అయిన విత్తనాల వారి కాలువ దుస్థితి ఇది. పట్టణంలోని వడ్డిగూడెం శివారు నుంచి అమలాపురం రూరల్ మండలం వైపు ప్రవహించే ఈ విత్తనాల వారి కాలువలో ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయి నీరు అతికష్టంగా కదులుతోంది. మానవ తప్పిదంతో గోదావరి జలాలను మోసుకొచ్చే ఈ కాలువ ప్లాస్టిక్ వ్యర్థాలను మోసుకొచ్చే కాలువగా మారింది. కాలువలో ఈ అడ్డంకులు తొలగించి ప్రవాహం సజావుగా సాగేలా సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత రైతులు, ప్రజలు విన్నవిస్తున్నారు.

వ్యవసాయ భూమి మార్పునకు చర్యలు

యానాం: నియోజకవర్గ పరిధిలో ప్రాన్సుతిప్ప ప్రాంతంలో ఉన్న భూమిని వివిధ అవసరాలకు ఉపయోగించుకునేలా చర్యలు తీసుకుంటున్నట్లు పుదుచ్చేరి ప్రభుత్వం బుధవారం మద్రాసు హైకోర్టుకు తెలియజేసిందని పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. అక్కడ ఉన్న వ్యవసాయ భూమిని రెసిడెన్షియల్, కమర్షియల్ ల్యాండ్గా మార్పు చేసేందుకు కావాల్సిన చర్యలు తీసుకుంటున్నట్లు కోర్టుకు వివరించారన్నారు. యానాం భవిష్యత్ అవసరాలు, మౌలిక సదుపాయాలకు సంబంధించి తయారు చేసిన మాస్టర్ ప్లాన్ త్వరలోనే ఆమోదం పొందుతుందని మల్లాడి కృష్ణారావు తెలిపారు. పుదుచ్చేరిలో భవనాల ఎత్తును పెంచేందుకు ఏవిధంగా అయితే అనుమతిచ్చారో అదేవిధంగా స్థలం తక్కువగా ఉన్న యానాంలో సైతం అనుమతులు ఇవ్వాలని పుదుచ్చేరి ప్రభుత్వానికి విన్నవించినట్లు తెలిపారు

టవర్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ ఆందోళన



చినగాడవిల్లిలో గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ దివాకర్

ఉప్పలగుప్తం: మండలంలోని చినగాడవిల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఎయిర్టెల్ 5జీ నెట్వర్క్ టవర్ను తమ గ్రామంలో నిర్మించవద్దంటూ గ్రామస్తులు బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ వి.ఎస్.దివాకర్ సంఘటనా ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. తమ గ్రామంలో కొంత కాలంగా నెట్వర్క్ టవర్ పనులు మొదలు పెట్టారని దానిని వెంటనే నిలిపి వేయాలని తహసీల్దార్కు గ్రామస్తులు వినతిపత్రం అందించారు. గ్రామంలో నివాస గృహాలకు దగ్గరగా ఈ టవర్ నిర్మించడంతో రేడియేషన్ పెరిగి ప్రజలు అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందని ఆందోళన వెలిబుచ్చారు. దీంతో గ్రామంలో జరుగుతున్న టవర్ పనులను నిలిపి వేయాలని తహసీల్దార్ దివాకర్ ఆదేశించారు.

ఉంగరాలకు సేవా భూషణ్ అవార్డు



హ్యూమన్ రైట్స్ అవార్డు అందుకున్న ఉంగరాల వెంకటేశ్వరరావు

తాళ్లరేవు: అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా కాకినాడలో జరిగిన మానవ హక్కుల సభలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు సేవా భూషణ్ అవార్డు అందుకున్నారు. కాకినాడ హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన సభలో ఆయనకు ఈ అవార్డును ప్రదానం చేశారు. గత 40 ఏళ్లుగా ఆయన సమాజానికి చేసిన సేవలకు గానూ ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు హ్యూమన్ రైట్స్ ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. అవార్డు అందుకున్న ఉంగరాలను పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు అభినందించారు.

ఓఎన్జీసీ పరిహారం చెల్లించాలి

యానాం: యానాం నియోజకవర్గంలో మత్స్యకారులకు కోట్లాది రూపాయల మేర వేట నష్టపరిహారం ఇస్తున్నట్లే ఎస్సీ, బీసీ వర్గాలకు సైతం పరిహారం అందించాలని బుధవారం పర్యావరణ పరిరక్షణ సమితి, బహుజన ఫ్రంట్ డిమాండ్ చేసింది. స్థానిక బుద్ధాపార్క్లో వివిధ వర్గాల నాయకులు, రిటైర్డ్ అధికారులు, సామాజికవేత్తల ఆధ్వర్యంలో ఓఎన్జీసీ, రిలయన్స్ చమురు సంస్థలు వదిలే కాలుష్య వాయువుల ద్వారా ప్రజలు వ్యాధుల బారిన పడుతున్న అంశంపై చర్చించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ రీజినల్ అడ్మినిస్ట్రేటర్ గిడ్డి బలరాం మాట్లాడుతూ.. యానాం పక్కనే రిలయన్స్, జీఎస్పీసీ వంటి సంస్థలు ఆన్షోర్ టెర్మినల్స్ను ఏర్పాటు చేసుకున్నాయన్నారు. ప్రతిరోజు ముడి చమురు, గ్యాస్ను ట్రీట్మెంట్ ప్లాంట్ల ద్వారా శుద్ధి చేసుకుంటున్నాయని.. ఈ దశలో కాలుష్యం వెదజల్లడంతో నియోజకవర్గ ప్రజలు క్యాన్సర్, కిడ్నీ తదితర వ్యాధుల బారిన పడతున్నారన్నారు. దీనికి ముఖ్యంగా నష్టపోయేది ఆయా ప్లాంట్ల సమీపంలోనే ఉన్న ఎస్సీ, బీసీ గ్రామాల ప్రజలేనని అన్నారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ దుగ్గుదుర్తి అనిత, దంగుడు బియ్యం సత్యనారాయణ, గోపీ సురేష్, కాకి నాగేశ్వరరావు, బహుజన ఫ్రంట్ కార్యదర్శి కొండబాబు, ఏనుగుపల్లి కృష్ణ, గురునాథం, జయరాం, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ వర్కర్ల అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

అమలాపురం రూరల్: అమలాపురం ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్ల వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం ఈదరపల్లి లక్ష్మీ నరసింహస్వామి నగర్ సంఘ భవనంలో సంఘం అధ్యక్షుడు కొప్పిశెట్టి వనమయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సంఘం నూతన అధ్యక్షుడిగా గాలి దేవర వెంకట రమణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా మట్టపర్తి సత్తిబాబు, ఉపాధ్యక్షుడిగా దొమ్మేటి స్వామి, కొప్పుల గంగాధర్, కోశాధికారులుగా అనిపిండి కామేష్, ఈ.సురేష్, సహాయ కార్యదర్శులుగా నాగ వెంకట దుర్గారావు, పీ.సత్తిరాజు, ఈ.కిరణ్, కార్యవర్గ సభ్యులుగా పి.శ్రీనివాస్, ఎస్.నాగేశ్వరరావు కె.భోగిరాజు, జే.నాగేశ్వరరావు, ఈ.సునీల్ కుమార్, ఈ. లోవరాజు, ఎం.శ్రీనివాస్, ఆర్.నరసింహమూర్తి, ఎం.వెంకటేశ్వరరావు ఎన్నికయ్యారు. అనంతరం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని తాళ్లరేవు బైపాస్ రహదారిలో నర్సరీ వద్ద బుధవారం కారు ఢీకొని బొక్కా లక్ష్మీ ప్రసాద్ అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు తాళ్లరేవు పరదేశమ్మ పేటకు చెందిన లక్ష్మీ ప్రసాద్ ద్విచక్రవాహనంపై యానాం వెళ్లి తిరిగి వస్తుండగా వేగంగా వచ్చిన కారు వెనుక నుంచి వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో లక్ష్మీ ప్రసాద్ తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు హుటాహుటిన కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.